# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 21-11-2025 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- జీ20 సమావేశాల్లో పాల్గొనేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ దక్షిణాఫ్రికాలోని జోహాన్నెస్ బెర్గ్ చేరుకున్నారు.
- ప్రపంచంలోనే అత్యంత ఆధునిక శక్తిగా బిఎస్ఎఫ్‌ను రూపొందించాలన్నదే లక్ష్యమని హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు.
- దేశంలో నాలుగు కొత్త కార్మిక చట్టాలను ఈరోజు నుండి అమలు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.
- దేశీయ వినోద రంగం రాబోయే 10 సంవత్సరాలలో 31 బిలియన్ డాలర్లకు పైగా సాధించే లక్ష్యాన్ని చేరుకుంటుందని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ ఎల్ మురుగన్ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = =

జీ20 వార్షిక సమావేశంలో పాల్గొనేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ దక్షిణాఫ్రికా చేరుకున్నారు. వాటర్క్లూఫ్ ఎయిర్‌ఫోర్స్ బేస్‌లో దిగిన ప్రధాని మోదీకి దక్షిణాఫ్రికా అధికారులు సంప్రదాయ పద్ధతిలో ఘనంగా స్వాగతం పలికారు. స్థానిక సాంస్కృతిక కళా ప్రదర్శనలతో ఆహ్వానించారు. ఈరోజు నుంచి ఈ నెల 23 వరకూ G20 సమావేశం నిర్వహిస్తున్నారు. ఆఫ్రికాలో జరుగుతున్న మొదటి G20 శిఖరాగ్ర సమావేశం కావడం విశేషం. 2023లో భారతదేశం G20 అధ్యక్షత వహించిన సమయంలో, ఆఫ్రికన్ యూనియన్ G20లో సభ్యత్వం పొందింది. కీలకమైన ప్రపంచ సమస్యలను చర్చించడానికి ఈ శిఖరాగ్ర సమావేశం ఒక అవకాశంగా ఉంటుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ సంవత్సరం G20 యొక్క ముఖ్య అంశాలుగా సంఘీభావం, సమానత్వం స్థిరత్వం ఉన్నాయి. ఈ సమావేశం జరుగుతున్న సమయంలోనే నరేంద్ర మోడీ పలువురు ప్రపంచాధినేతలతో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. భారత్, బ్రెజిల్, దక్షిణాఫ్రికాతో కూడిన ఐబీఎస్ఏ కూటమి ఆరో త్రైపాక్షిక సమావేశంలోనూ ఆయన పాల్గొననున్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

రానున్న అయిదేళ్ళ కాలంలో ప్రపంచంలోనే అత్యంత ఆధునిక శక్తిగా సరిహద్దు భద్రతా దళం బిఎస్ఎఫ్‌ను రూపొందించాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. గుజరాత్‌లోని భుజ్‌లో ఈరోజు జరిగిన బిఎస్ఎఫ్ వజ్రోత్సవ వేడుకలలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చొరబాటుదారులు దేశంలో ప్రవేశించకుండా బిఎస్ఎఫ్ నిరంతరం కాపాడుతోందని అన్నారు. ఛత్తీస్‌గఢ్‌లో బిఎస్ఎఫ్ కఠిన చర్యల కారణంగా 127 మంది మావోయిస్టులు లొంగిపోయారని తెలిపారు. 2026 మార్చి నాటికి దేశం నక్సలిజం నుండి విముక్తి పొందుతుందని స్పష్టం చేశారు. ప్రతి ఒక్క చొరబాటుదారుడినీ దేశం నుండి వెనక్కి పంపడమే ప్రభుత్వ విధానమని అమిత్ షా పేర్కొంటూ...

(వాయిస్…27 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

దేశంలో దశాబ్దాల నాటి కార్మిక చట్టాలను సరళీకృతం చేయడానికి మరియు క్రమబద్ధీకరించడానికి ఉద్దేశించిన నాలుగు కొత్త కార్మిక చట్టాలను అమలు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ఈరోజు ప్రకటించింది. కొత్త కార్మిక చట్టాలు దేశ శ్రామిక శక్తికి మెరుగైన వేతనాలు, భద్రత, సామాజిక భద్రత మరియు సంక్షేమాన్ని నిర్ధారిస్తాయని కార్మిక మరియు ఉపాధి మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవియా సోషల్ మీడియా పోస్ట్‌లో తెలిపారు. వేతనాల కోడ్, 2019, పారిశ్రామిక సంబంధాల కోడ్, 2020, సామాజిక భద్రత కోడ్, 2020 మరియు వృత్తి భద్రత, ఆరోగ్యం మరియు పని పరిస్థితుల కోడ్, 2020 ఈరోజు నుండి అమల్లోకి వచ్చాయి. ఈ సంస్కరణలు కేవలం సాధారణ మార్పులు మాత్రమే కాదని, దేశంలోని ప్రతి కార్మికుడికి ప్రభుత్వం గౌరవ హామీ అని మాండవియా అన్నారు. గత దశాబ్దంలో భారతదేశం సామాజిక భద్రతా కవరేజీని విస్తరించిందని, 2015 సంవత్సరంలో 19 శాతం శ్రామిక శక్తి నుండి 2025 నాటికి 64 శాతానికి పెరిగిందని కార్మిక మరియు ఉపాధి మంత్రిత్వ శాఖ తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = =

దేశీయ మీడియా వినోద రంగం రాబోయే 10 సంవత్సరాలలో 31 బిలియన్ డాలర్లకు పైగా సాధించే లక్ష్యాన్ని చేరుకుంటుందని కేంద్ర సమాచార ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ ఎల్ మురుగన్ తెలిపారు. గోవాలోని పనాజీలో జరుగుతున్న 56వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం (ఇఫీ) కార్యక్రమాలు రెండవ రోజుకు చేరుకున్నాయి. ఎల్ మురుగన్ అధ్యక్షతన ఈరోజు జరిగిన వివిధ దేశాల రాయబారుల  రౌండ్ టేబుల్ ఆన్ కో-ప్రొడక్షన్ సమావేశంలో పైరసీ నిరోధక చర్యలను బలోపేతం చేయడంపై చర్చించారు. అంతర్జాతీయ చలనచిత్ర సహ-నిర్మాణాన్ని విస్తరించడం అలాగే ప్రపంచ చలనచిత్రోత్సవాలలో భారతీయ సినిమాను ప్రోత్సహించడం వంటి వాటి గురించి సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా మురుగన్ మాట్లాడుతూ, భారతదేశం ప్రపంచానికి ఒక స్టూడియోగా మారిందని అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 128వ సంచిక ఈనెల 30వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 28వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

= = = = = = = = = = = = = = = = = = =

రాబోయే 2026-27 కేంద్ర బడ్జెట్‌కు సంబంధించిన ముందస్తు కసరత్తు ప్రస్తుతం జరుగుతోంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన న్యూఢిల్లీలో ఈరోజు నిర్వహించిన సమావేశంలో మౌలిక సదుపాయాలు, ఇంధన రంగాల నిపుణులు హాజరయ్యారు. విద్యుత్ మంత్రిత్వ శాఖ, ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వ శాఖ, రోడ్డు రవాణా రహదారుల మంత్రిత్వ శాఖ కార్యదర్శులు, రైల్వే బోర్డు ఛైర్మన్  కేంద్ర ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు ఈ సమావేశానికి హాజరయ్యారు.

= = = = = = = = = = = = = = = = = = =

ఢిల్లీలో జరుగుతున్న 2025 ఇండియా ఇంటర్నేషనల్ ట్రేడ్ ఫెయిర్ (ఐఐటిఎఫ్) లో భాగంగా ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేద ఏర్పాటు చేసిన ఆయుష్ కి సంబంధించిన వేదిక ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఇందులో భాగంగా ఆరోగ్యకరమైన స్నాక్స్, ప్రీమిక్స్ లతో తయారుచేసిన ఆయుర్వేద ఆధారిత పోషకాహారాన్ని ఈ వేదిక ద్వారా ప్రదర్శిస్తున్నారు. ఆయుష్ వేదిక వద్ద వివిధ వ్యాధులకు సంబంధించి  ఉచితంగా మందులని సైతం అందించారు. ఆయుర్వేద ద్వారా ఆరోగ్యవంతమైన ఉత్పత్తులను ఎలా అందించగలమన్నది నిర్వాహకులు వివరించారు. ఆయుర్వేద పోషకాహారం గురించి తెలియచేయడమే కాకుండా మిల్లెట్ క్విజ్ వంటివి నిర్వహించారు. ఆరోగ్యకరమైన ఆహార ఆవిష్కరణలతో రాష్ట్రీయ ఆయుర్వేద విద్యాపీఠ్ ప్రపంచ సందర్శకులను విశేషంగా ఆకర్షిస్తోంది.

= = = = = = = = = = = = = = = = = = = =

దుబాయ్ ఎయిర్ షోలో జరిగిన వైమానిక ప్రదర్శనలో భారత వైమానిక దళ పైలట్ మృతి పట్ల రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబానికి సంతాపం తెలియచేశారు. ఈ విషాద సమయంలో దేశం పైలట్ కుటుంబానికి అండగా నిలుస్తుందని రాజ్ నాథ్ సింగ్ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. తేజస్ విమానం ప్రమాదానికి గురైన సంఘటనపై రక్షణ సిబ్బంది చీఫ్ జనరల్ అనిల్ చౌహాన్ విచారం వ్యక్తం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = =

రాబోయే రెండు రోజులు అండమాన్ నికోబార్ దీవులలో భారీ నుండి అతి భారీ వర్షపాతం ఉంటుందని భారత వాతావరణ కేంద్రం ఐఎండీ అంచనా వేసింది. రాబోయే మూడు రోజుల్లో కేరళ, మాహే తమిళనాడులలో భారీ వర్షపాతం ఉంటుందని పేర్కొంది. అలాగే, పశ్చిమ మధ్యప్రదేశ్‌లోని కొన్ని ప్రాంతాల్లో రాబోయే రెండు రోజుల్లో చలిగాలులు వీస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. మరిన్ని వివరాలను వాతావరణ శాస్త్రవేత్త డాక్టర్ సత్యప్రకాష్ వివరిస్తూ...

(వాయిస్… 27 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = =

ఉప రాష్ట్రపతి సిపి. రాధాకృష్ణన్ రేపటి నుండి రెండు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్ లో పర్యటిస్తారు. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని శ్రీ సత్యసాయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ 44వ స్నాతకోత్సవంలో ఉపరాష్ట్రపతి ముఖ్య అతిథిగా పాల్గొంటారు. రెండవ రోజున శ్రీ సత్యసాయి హిల్ వ్యూ స్టేడియంలో జరిగే శ్రీ సత్యసాయి బాబా శతాబ్ది ఉత్సవాలకు ఉపరాష్ట్రపతి హాజరవుతారని అధికార వర్గాలు తెలిపాయి.

= = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = =